క్లుప్తంగా

తెనాలి-చందోలు రహదారిలో రాకపోకలపై నిషేధం

తెనాలిరూరల్: రోడ్డు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో తెనాలి నుంచి బాపట్ల జిల్లా చందోలుకు వెళ్లే రహదారిలో వాహన రాకపోకలపై వారం రోజుల పాటు నిషేధం విధిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి నుంచి చందోలు వెళ్లే మార్గంలో పెదపూడి కూడలి వద్ద రోడ్డు మరమ్మతులు చేస్తున్న కారణంగా కూడలి మీదుగా వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందన్నారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు పనులు జరుగుతాయని, ప్రజలు కూచిపూడి-గోవాడ మార్గాన్ని ఆశ్రయించాలని సూచించారు.

29న కౌన్సిల్ సమావేశం

తెనాలిరూరల్: స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

30న అన్నమయ్య కీర్తనల పోటీలు

తెనాలిరూరల్: వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో అన్నమాచార్యుల వారి 615వ జయంతి సందర్భంగా అన్నమయ్య పాటల పోటీలను 30వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక బోస్‌రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమ వివరాలను తెలియజేశారు. అన్నమయ్య పాటల ప్రచారం నిమిత్తం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 29వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు కొండెపి శ్రీనివాసరావు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన 32 మంది విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో లక్కరాజు లక్ష్మణరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలిరూరల్: ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో తెనాలి ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పోస్ట్‌మాస్టర్ తిరుపతమ్మ బుధవారం ప్రారంభించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవాదళ్, ఆర్యవైశ్య యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా రెండో ఏడాది చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మద్దాళి శేషాచలం, తూనుగుంట్ల సుబ్బారావు, సీవీ రమణ, కొల్లా గురునాథ్ గుప్తా, మద్ది రామకోటేశ్వరరావు, ఆతుకూరి పూర్ణచంద్రరావు, ఎంఎటుస్ఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి



కొల్లిపర: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపర గ్రామానికి చెందిన కళ్లం కృష్ణారెడ్డి (35) తన సొంత ట్రాక్టర్ పై తన తండ్రితో కలసి మొక్కజొన్నలను వేబ్రిడ్జి కాటాకు తీసుకొని వచ్చి కాటాను వేయించుకొని అక్కడ తండ్రికి ట్రాక్టర్ ఇచ్చి రివర్స్ చేయమని అతను ట్రాక్టర్ వెనుక ఉండి డైరెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణారెడ్డిని కుటుంబసభ్యులు వెంటనే ఒక ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు గలరు.

'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'

మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలపై కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రచార భేరీ విజయవంతంగా జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, బొర్రా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

1న యథావిధిగా పెన్షన్ల పంపిణీ

మంగళగిరి: రాజధాని ప్రాంతంలో భూమి లేని పేదలకు పంపిణీ చేసే సామాజిక పింఛన్లను మే 1న యథావిధిగా పంపిణీ చేయనున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చికి సంబంధించి పింఛన్ల డేటా ఇంటిగ్రేషన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల వల్ల పంపిణీకి స్వల్ప అంతరాయం కలిగిందని, అయినప్పటికీ సామాజిక భద్రతా పింఛన్ల నిధి నుంచి 7,478 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని, సాంకేతిక లోపంతో పింఛను అందుకోలేక పోయిన లబ్ధిదారులకు ఏప్రిల్‌నెల పింఛనుతోపాటు మార్చి నెల పింఛను కూడా కలిపి మే 1న వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామని వివరించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పండితులు



కాశీలో ప్రవచనం చేస్తున్న బాలస్వామీజీ

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యపురంలోని మహా విద్యా పీఠంలో గల అభయ హస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సుబ్రహ్మణ్య స్వామి అభిషేకం, అర్చన జరిపారు. 10 గంటలకు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. 12 గంటలకు మంగళ హారతి ఇచ్చి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు సీహెచ్ సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షించారు.

గంగా పుష్కరాల్లో సాధువులకు సత్కారం

తెనాలిటౌన్: గంగానది పుష్కరాల్లో భాగంగా కాశీలో తెనాలికి చెందిన పూజశ్రీ బాలస్వామీజీ బుధవారం సాధువులకు స్నానం చేయించి వారిని సత్కరించారు. సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో గంగానది స్నానం, శివాభిషేకం, అర్చనలు, పూజలు జరిపారు. సుమారు 200 మంది సాధువులను సత్కరించి వారికి పుష్కర విశిష్టత గురించి ప్రవచనం చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు సాలిగ్రామ మఠం సెక్రటరీ ఎం.రమణయ్య, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు తెలిపారు.

అన్నిరంగాల్లో విఫలమైన కేంద్రం



మోదీని గద్దె దింపండి అంటూ ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

కొల్లిపర: నిత్యావసర సరకుల ధరలు తగ్గిస్తాం, నిరుద్యోగులకు ఏటా 2కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం, పంటలకు ధరలు కల్పిస్తాం అంటూ ఎన్నో వాగ్దానాలు చేసిన మోదీ ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ 9 సంవత్సరాలలో అన్నిరంగాల్లో విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.భావన్నారాయణ పేర్కొన్నారు. బుధవారం సీపీఎం, సీపీఐ ప్రచార యాత్రలో భాగంగా కొల్లిపర, దావులూరు గ్రామాల్లోని రైతులు, పేద కుటుంబాల కష్టాలను తెలుసుకుంటూ, కేంద్రం ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ప్రచారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్ట బెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఏకమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్, ఎన్.రాజ్యలక్ష్మి, బత్తుల సుబ్బారావు, రవిచంద్ర, సురేష్, రైతులు పాల్గొన్నారు.

కళాకారుడు రామకోటేశ్వరరావుకు సన్మానం



రామకోటేశ్వరరావును సన్మానిస్తున్న మల్లేశ్వరరావు, సాంబశివరావు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం నిండు సంసారం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం ఎర్రకోటవీరుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు మండల కిషోర్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 27వ వార్డు బోయపాటి అరుణ, కోగంటి మణి, దివి నగరాజకుమారి, కోగంటి కోటేశ్వరరావు, అయినాల మల్లేశ్వకరరావు, పెమ్మసాని పోతురాజుఏ, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, ముళ్లపూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై హత్యాయత్నం

పిడపర్రు (కొల్లిపర): వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గ్రామ సర్పంచ్‌పై హత్యాయత్నం జరిగిన ఘటన మంగళవారం రాత్రి పొద్దు పోయాక చోటుచేసుకుంది. కొల్లిపర ఆర్.రవీంద్రరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పిడపర్రు గ్రామానికి చెందిన సర్పంచ్ దూరు రత్నబాబును అదే గ్రామానికి చెందిన జోసఫ్ అతని కుమారులు వ్యక్తిగత కక్షలు నేపథ్యంలో మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. క్షత గాత్రుడిని కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తెనాలిలోని ఒక ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. వైద్యశాల నుంచి బుధవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.రవీంద్రారెడ్డి తెలిపారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పేటేరులో ఆధార్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

రేపల్లె రూరల్: ఆధార్ సేవలు ప్రజలకు త్వరితగతిన అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాలలో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారని పేటేరు గ్రామ సెక్రటరీ పుష్పకుమారి తెలిపారు. మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరు సచివాలయంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కనపర్తి రవికిరణ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నెహ్రూనికేతన్ విద్యార్థుల ప్రతిభ



ఎ. రూప్‌నంద్ శ్రీనాథ్



ఎ. హేమశ్రీ



బి. భవానిలక్ష్మి



డి. లోకేష్

తెనాలిరూరల్: ఇంటర్ ఫలితాల్లో తెనాలి బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. ఎంపీసీ విభాగంలో సీనియర్ ఇంటర్ విద్యార్థి ఎ. రూప్‌నంద్ శ్రీనాథ్(985), ఎ.హేమశ్రీ(982), బి.భవానిలక్ష్మి(981), డి. లోకేష్(980) మార్కులు సాధించినట్టు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి బుధవారం రాత్రి తెలిపారు. అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులకు మురళీకాంత్ అభినందనలు తెలిపారు.

వైష్ణవిలో ఉత్తమ ఫలితాలు..

తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో జి. బాలయమున(975), బైపీసీ విభాగంలో కె.మనోజ్ఞ(969/1000), జూనియర్ ఎంపీసీ విభాగంలో ఎ.వెంకట శ్రీనివాసరావు(458), సీఈసీ విభాగంలో ఎస్‌కే ఖాదర్ షరీఫ్(477) మార్కులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు తెలిపారు. సీనియర్ విభాగంలో 48 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారని, జూనియర్ విభాగంలో 400కుపైగా మార్కులు సాధించిన వారు 32 మంది ఉన్నారని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీనివాసరావు, అధ్యాపకులు షంషద్ బేగం, రోజ్‌మేరి, సురేష్, బాబు, నందకిషోర్ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో వివేక ప్రభంజనం



మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ వీరనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది

తెనాలిరూరల్: ఇంటర్ ఫలితాల్లో వివేక జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో కళాశాల విద్యార్థినులు ఎస్.భావనాలక్ష్మీదేవి, ఎస్.నందినీదుర్గ 986 మార్కులు, మట్టుపల్లి దేవిశ్రావణి(985), ఐ.తారక్ వెంకట్(985), ఆలమూరి యామిని(984), షేక్ ఫర్హానా(984), ఎం.జాహ్నవి(983), తోట హేమంతి(983), బి.జయసాయి కార్తీక్ (983) సులోచన(982), బైపీసీ గ్రూపులో షేక్ షబ్నమ్(985) మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో రెడ్రౌతు సాయిచంద్రికాంజలి, కె.అనుదీప్త 464, ఎస్, శరణ్య, సీహెచ్ స్నేహ (463), సమ్రీన్(462) మార్కులు సాధించారు. బుధవారం రాత్రి కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ విద్యార్థులను అభినందించి సత్కరించారు. తమ విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించారని, సంస్కృతంలో 100కు 99 మార్కులు సాధించారని వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి జయంత్యుత్సవం



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఆంధ్ర మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చైర్‌పర్సన్ వై.రమాప్రభ, కళాశాల అధ్యాపకులు, శిష్యులు పాల్గొని త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపించారు. వయొలిన్‌పై పి, కామేశ్వరి, మృదంగంపై కేవీ రామకృష్ణ సహకరించారు. అలానే ఎ.శాస్త్రి, డాక్టర్ చింతలపాటి మంజుల, స్థానిక కళాకారులు కీర్తనలను ఆలపించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానసీమ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాన్ని వైభవంగా నిర్వహించిన నిర్వాహకులను, రమాప్రభ, బృందాన్ని అభినందించి సత్కరించారు.

సుందరం.. సుమనోహరం



బోటుయార్డు రోడ్డులో అందమైన రంగులు, చిత్రాలతో తీర్చిదిద్దిన ప్రహరీ



రైల్వేబ్రిడ్జి ప్రాంతంలో నాటిన మొక్కలు

తాడేపల్లిరూరల్ : సీఆర్డీఏ ఆధ్వర్యంలో తాడేపల్లి బోటు యార్డు రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం రోడ్డు వెంబడి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. సీఆర్డీఏ కమిషన్ వివేక్ యాదవ్ ఆదేశాల మేరకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. బోటు యార్డ ప్రాంతంలో ఉన్న ప్రహరీలకు రంగులు వేసి, అందమైన పెయింటింగ్‌లతో తీర్చిదిద్దారు. రహదారికి ఇరువైపులా చక్కని మొక్కలు నాటడమే కాకుండా వాటి చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్ : పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన పదో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో తమ విశ్వవిద్యాలయంలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిట్టు కుమార్, బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.వి.అశ్విన్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారని చెప్పారు.

బి ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చందన్‌కుమార్, ట్రిపుల్ ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చంద్రశేఖర్, ఫార్మాడీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.కొబాయ్ ద్వితీయ స్థానాల్లో నిలిచి రజత పతకాలను సాధించారని వివరించారు. విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, డాక్టర్ కె.సుజాత, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.

బస్ షెల్టర్‌కు అడ్డంగా టీడీపీ ఫ్లెక్సీ



పెదవడ్లపూడి సెంటర్‌లో బస్ షెల్టర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తాడేపల్లిరూరల్: టీడీపీ నేతలు బస్ షెల్టర్‌కు అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీని ఇప్పటివరకు తొలగించలేదు. దీంతో ప్రయాణికులు షెల్టర్ లోపలకు వెళ్లే వీలులేక అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎండలో రోడ్డుపైనే నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లెక్సీని కార్పొరేషన్ సిబ్బంది కూడా తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా లూథరన్ చర్చి వార్షిక ప్రతిష్టా ఉత్సవం



చర్చిలో ఫాదర్ ఆశీస్సులు పొందుతున్న కత్తెర సురేష్ కుమార్

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని పరిశుద్ధ త్రిత్వ లూథరన్ చర్చి ద్వితీయ వార్షిక ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫాదర్ ఆశీస్సులు అందుకున్నారు.

సురేష్‌కుమార్‌ను సత్కరించిన ముస్లిం మతపెద్దలు

రాయపూడి ఈద్గా సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడం హర్షణీయమని తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ ముస్లిం మతపెద్దలు, పలువురు నాయకులు కొనియాడారు. రాయపూడిలో ఈద్గా లేక రోడ్లపై ప్రార్థనలు నిర్వహించే పరిస్థితి ఉన్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన సీఎంను కలిసి ఈద్గా స్థల కేటాయింపు దిశగా చొరవ తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దీంతో ముస్లింలు బుధవారం సురేష్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ



జంపని రైతు భరోసా కేంద్రంలో పచ్చి రొట్ట విత్తనాలు అందజేసిన ఏడీఏ షేక్ హుసేన్

జంపని(వేమూరు): రైతులు ప్రకృతి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని రేపల్లె డివిజన్ వ్యవసాయాధికారి హుసేన్ తెలిపారు. జంపని గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు అనేక సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఖరీఫ్ సీజనకు ముందు రైతులకు వ్యవసాయ పెట్టుబడులు కోసం రైతు భరోసా ద్వారా డబ్బులు అదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పచ్చి రొట్ట ఎరువు కోసం సబ్సిడీపై విత్తనాలు అందించడం జరుగుతుందని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. పచ్చి రొట్ట ఎరువులు 30 రకాలు కిట్లు అందజేశారు. పచ్చి రొట్ట ఎరువుల వల్ల రసాయన ఎరువులు వాడకం తగ్గించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది చందన, మహాలక్ష్మి, గుమ్మడి నవీన్, పీఆర్‌పీ ప్రవీణ్ కుమార్, ప్రసాద్, ఎస్ఎఫ్ఏ, ఐసీఆర్‌పీ శ్రీకాంత్, శంకర్ రవి, తేజ, గోవతటి అనిత, రామస్వామి, కసుకుర్తి శైలజ, వాకా శాంత కుమారి పాల్గొన్నారు.

మరో లింకు రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మరో లింక్‌రోడ్ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు బుధవారం చేపట్టారు. ఉండవల్లి పోలకమ్మతల్లి దేవస్థానం నుంచి పలు రోడ్లను కలుపుతూ జామాయిల్ తోట వరకు రోడ్డు ఉంది. ఇప్పటి వరకు ఆ రోడ్డు నిర్మాణ పనులు ఎవరూ చేపట్టలేదు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లడంతో నెల రోజుల వ్యవధిలో గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల పాతజాతీయరహదారికి, జాయిల్‌తోట రోడ్డుకు లింక్ రోడ్డుగా ఉందని ఏఈ కిషోర్ తెలిపారు.

నీటి తీరువాను వెంటనే చెల్లించండి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో ఉన్న 18 గ్రామాల్లో భూమి కలిగిన రైతులు నీటితీరువా పన్నులను వెంటనే చెల్లించాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. రైతులు సమీపంలోని సచివాలయాల్లో గానీ, లేదా భూమి ఉన్న ప్రాంతంలోని సచివాలయాల్లో గానీ వెంటనే నీటి తీరువా, ఇతర పన్నులను చెల్లించాలని కోరారు.